

## రేపు జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలను ఈ నెల 24న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాల సింథటిక్ ట్రాక్‌పై పోటీలను అండర్-8, 10, 12 వయస్సు బాలబాలికలకు పోటీలను నిర్వహించనున్నామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహి పాల్, కడారి రవి తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ధ్రువపత్రాలతో 24న స్పోర్ట్స్ స్కూల్ క్రీడామైదానంలో రిపోర్టు చేయాలని తెలిపారు.

### మహిళల సంక్షేమం కోసమే

# శుక్రవారం సభ

- మూడునెలలకు ఒకసారి వైద్య పరీక్షలు తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేల సత్పతి

వీణవంక, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళల, పిల్లల సంక్షేమం కోసమే శుక్రవారం గ్రామసభ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండలంలోని ఎలుబాక గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం సభ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మహిళ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి అనారోగ్యం భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ సభకు రావడం ద్వారా పథకాలు, ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా అందించే వైద్య పరీక్షల పట్ల అవగాహన పెరుగుతుందన్నారు. కుటుంబం గురించి ఆలోచించే మహిళలు ముందుగా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. గర్భాశయ, రొమ్ము, క్యాన్సర్లపై అవగాహన పెంచుకోవా లన్నారు. ప్రతి మంగళ, గురువారం ఆరోగ్య మహిళ ద్వారా ప్రభుత్వాసుపత్రుల్లో 55 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్యం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎలుబాక గ్రామంలో 13 ఏళ్లు దాటిన 720 మందికి, ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద 520 మందికి వైద్య పరీక్షలు వైద్య సిబ్బంది నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు. అనంతరం గర్భిణీలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. చిన్నారుల దత్తతకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేష్‌బాబు, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, సీడీపీవో సుగుణ, మండల ప్రత్యేక అధికారి కొమురయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, డీఆర్‌డీవో పీడీ సునీత, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీధర్, సబ్‌సెంటర్ వైద్యాధికారి ప్రిసిల్లాలు ఉన్నారు.




(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

వరి సన్న రకాలు సాగు చేసిన రైతులకు ప్రభుత్వం ముందుగా చెప్పిన విధంగానే బోనస్ చెల్లింపులు ప్రారంభించింది. క్వింటాల్‌కు 500 రూపాయల చొప్పున రైతులకు బోనస్‌గా చెల్లిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యంలో సన్న వరి రకాలకు 4 కోట్ల 49 లక్షల రూపాయల బోనస్ విడుదల కాగా, వాటిని ఆయా రైతుల ఖాతాల్లో జమ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 325 కొనుగోలు కేంద్రాల ద్వారా 20,602 మంది రైతులకు చెందిన 1,38,151 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 320 కోట్ల 51 లక్షల విలువ చేసే ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే కస్టమ్ మిల్లింగ్ కోసం రైసు మిల్లులకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు 1,37,088 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించగా మరో 1,062 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్నది. కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన వరి ధాన్యంలో 1,01,850 మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం కాగా, 36,300 మెట్రిక్ టన్నుల ధాన్యం సన్నరకాలు ఉన్నాయి. ఈ సన్న రకాలకు 18కోట్ల 15 లక్షల రూపాయలు ప్రభుత్వం బోనస్‌గా చెల్లించాల్సి ఉండగా 4 కోట్ల 49 లక్షలు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటవెంటనే డబ్బు చెల్లించేందుకు, అలాగే బోనస్ డబ్బును రైతుల ఖాతాల్లో జమచేసేందుకు సివిల్ సప్లయి శాఖ చర్యలు తీసుకుంటున్నది. 1,38,151 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా 1,19,076 క్వింటాళ్ల ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. వీటిలో 1,04,259 మెట్రిక్ టన్నుల ధాన్యంకు సంబంధించిన ట్రక్ షీట్‌ను తయారు చేసి మిల్లులకు తరలించారు. ఇప్పటి వరకు 94,432 మెట్రిక్ టన్నుల ధాన్యం తమ మిల్లులకు చేరినట్లుగా మిల్లర్లు ధ్రువీకరించారు. 13,966 మంది రైతులకు సంబంధించిన 93,209 మెట్రిక్ టన్నుల ధాన్యానికి గాను 216 కోట్ల 25 లక్షల రూపాయలు వారి ఖాతాల్లో జమచేశారు. ధాన్యం అప్‌లోడ్ చేయడం మిల్లులకు తరలించగా మిల్లర్లు ఆ ధాన్యాన్ని తమమిల్లుల్లో దింపుకొని ధ్రువీకరించే వరకు జరుగుతున్న జాప్యం కారణంగా రైతులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా కొనుగోలు చేసిన 24 గంటల్లో ధాన్యం డబ్బు అందడం లేదు. దీనికోసం వారంరోజులకు పైగా ఎదిరిచూడాల్సి వస్తున్నది. 1,38,151 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసిన సివిల్ సప్లయిశాఖ 320 కోట్ల 51 లక్షలు రైతులకు చెల్లించాల్సి ఉండగా 216 కోట్ల 25 లక్షలు మాత్రమే వారి ఖాతాల్లో ఇప్పటి వరకు జమ అయ్యాయి. 6,736 మంది రైతులకు 44,942 మెట్రిక్ టన్నుల ధాన్యానికిగాను 104 కోట్ల 26 లక్షల రూపాయలు ఇంకా చెల్లించాల్సి ఉన్నది.

సన్న ధాన్యం బోనస్‌గా ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికిగాను 13 కోట్ల 66 లక్షల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉన్నది. ఈ సీజన్‌లో 2,73,397 ఎకరాల్లో వరి సాగు జరుగగా 6లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యం ఉత్పత్తి అయినా రైతుల స్వంత వినియోగం, విత్తన పంట మినహాయిస్తే 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి వస్తుందని, ఇందులో 50 వేల మెట్రిక్ టన్నులు మిల్లర్లు కొనుగోలు చేసినా 4 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశారు. నవంబర్ మాసాంతం వరకు 81శాతం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని, ఆ తర్వాత డిసెంబర్‌లో మిగతా ధాన్యం వస్తుందని అంచనా వేశారు.

జిల్లా యంత్రాంగం వేసిన అంచనాల ప్రకారం 3,25,923 మెట్రిక్ టన్నుల ధాన్యం ఈనెలాఖరు వరకు కొనుగోలు కేంద్రాలకు రావలసి ఉన్నది. అయితే ఇప్పటి వరకు కేవల ం 1,38,151 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాలకు రాగా వాటిని ఖరీదు చేశారు. జిల్లా యంత్రాంగం అంచనాల ప్రకారం 2లక్షల 93వేల మెట్రిక్ టన్నులు దొడ్డు ధాన్యం, లక్షా 7వేల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావించారు. అయితే ఇప్పటి వరకు కేవలం 36,300 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కొనుగోలు చేశారు. సన్న ధాన్యాన్ని రైతులు

మిగతా 8వ పేజీలో... ..



- సన్న ధాన్యానికి బోనస్ చెల్లింపులు షురూ
- రైతుల ఖాతాల్లో రూ.4 కోట్ల 49 లక్షలు
- కొనుగోలు చేసిన మొత్తం ధాన్యం 1,38,151 టన్నులు
- ధాన్యం విలువ రూ.320.51 కోట్లు
- ఇప్పటి వరకు చెల్లించింది రూ.216.25 కోట్లు
- మార్కెట్‌కు అంతంత మాత్రమే సన్నధాన్యం

### నేటి పరిస్థితుల్లో కరాటే మార్షల్ ఆర్ట్స్ తప్పనిసరి

- సినీ హీరో సుమన్
- ఘనంగా ప్రారంభమైన జాతీయస్థాయి కరాటే పోటీలు

-కరీంనగర్ స్పోర్ట్స్, ఆంధ్రజ్యోతి

7

### 'కమాండ్ కంట్రోల్' పనులు త్వరగా పూర్తి చేయండి

-కరీంనగర్ టౌన్, ఆంధ్రజ్యోతి

8

### రహదారులను కమ్మేసిన ముళ్ల చెట్లు

- ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు

- గంగాధర, ఆంధ్రజ్యోతి

8

### మధ్యాహ్న భోజనం తిని

# విద్యార్థులకు అస్వస్థత

- కడుపునొప్పి, వాంతులతో ఇబ్బందులు
- వైద్యం అందించిన స్థానిక వైద్య సిబ్బంది

గంగాధర, నవ ంబరు 22 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం బూరుగుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ముగ్గురికి వాంతులు కాగా మిగతా విద్యార్థులు కడుపునొప్పితో బాధపడ్డారు. స్థానిక వైద్యసిబ్బంది చికిత్స చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో 205 మంది విద్యార్థులకు శుక్రవారం 180 విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు రోజు మాదిరిగానే మధ్యాహ్నం భోజనం చేశారు. కొత్త బియ్యం కావడంతో కొంత ఉడికి అక్కడక్కడా ఉడకని అన్నం తిన్న కొంత మంది విద్యార్థులు గంట తరువాత కడుపునొప్పితో బాధపడ్డారు. ముగ్గురు విద్యార్థులు వాంతులు చేసుకు న్నారు. గమనించిన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు వెంటనే పల్లె దవాఖానాకు సమాచారం అందించగా వైద్యసిబ్బంది పరీక్షించి చికిత్స చేశారు. విషయం తెలియగానే కొందరు విద్యార్థులను వారి తల్లి దండ్రులు పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్లారు. కొత్త బియ్యం కావడంతో సరిగా ఉడకని అన్నం తిన్న విద్యా ర్థుల్లో కొంతమంది అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం విద్యా ర్థులు కోలుకు న్నారని ఎవరికీ ప్రమాదం లేదని ప్రధానో పాధ్యాయుడు మల్లికార్జున్ తెలిపారు.



వైద్యసిబ్బంది పర్యవేక్షణలో ఆడుకుంటున్న విద్యార్థులు

### సర్వే ఆన్‌లైన్ చేసే విధుల నుంచి

## ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సమాచారాన్ని ఆన్‌లైన్ చేసే విధుల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని పిఆర్‌టియుటిజి ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మండల ఆనందం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. సర్వేతో విద్యార్థుల సంఖ్యపై ఆ ప్రభావం పడిందని, సర్వే సమాచా రాన్ని అప్‌లోడ్ కోసం మరో 10 రోజులు విధులను అప్పగిస్తే ప్రాథమిక పాఠశాలలపై తీవ్ర ప్రభావం పడుతుందని చెప్పారు. సర్వే సమాచారాన్ని అప్‌లోడ్ చేసే బాధ్యతలను ఇతర శాఖల ఉద్యోగులకు అప్పగించి టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు.

## విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వాడవద్దు

సుభాష్‌నగర్, నవంబర్22(ఆంధ్రజ్యోతి): విచ్చలవిడిగా, అవసరం లేకున్నా యాంటీబయాటిక్స్ వాడవద్దని కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్ తెలిపారు. శుక్రవారం యాంటీ బయాటిక్స్ రెసిస్టెన్సీపై రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరుచుగా అవసరం లేకున్నా యాంటీబయాటిక్స్ వాడటం, మాములు జలుబు లాంటి వాటికి కూడా యాంటీ బయోటిక్స్ వాడటం, జబ్బుకు సరిపడా ప్రత్యేకమైన యాంటీ బయాటిక్స్ వాడకపోవడం, జబ్బుకు సరిపడా డోస్‌లు, నిర్ణీత గడువు లేకపోవడం, కనీసం అల్లోపతి వైద్యంలో యంబీబీఎస్ కూడా అర్హత లేని వ్యక్తులు అవగాహన లేకుండా విచ్చల విడిగా యాంటీబయోటిక్స్ ఇవ్వడం వల్ల ప్రాణాలకు ముప్పు ఏర్పడే పరిస్థితి వస్తుందన్నారు. కనీసం యంబీబీ ఎస్ డిగ్రీ ఉన్న వైద్యులు రాసిన యాంటీ బయాటిక్స్‌లను మాత్రమే వాడాలని, ఎవరికి తోచిన విధంగా వారు స్వంతంగా యాంటీబయాటిక్స్ వాడవద్దని అన్నారు. వాడగా మిగిలిపోయిన మందులను ఇతరు లు ఉపయోగించకూడదని జబ్బుకు సరిపోయే డాక్టర్‌లు రాసిన, సూచించిన యాంటీ బయాటిక్స్‌నే వాడాలని సూచించారు. అన్నింటికంటే ముఖ్యంగా తరుచుగా చేతులు కడుక్కోవడం ద్వారా జబ్బుల బారిన పడకుండా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ నవీన్‌కుమార్, మాజీ అధ్యక్షుడు డాక్టర్ రాంకిరణ్, డాక్టర్ విజయమోహన్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

### శాంతి భద్రతలకు

# విఘాతం కలిగిస్తే రౌడీషీట్

- సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- గంజాయి, పీడీఎస్ బియ్యం, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి
- సీపీ అభిషేక్ మొహంతి




పోలీస్ స్టేషన్ ఆవరణలో దెబ్బతిన్న పోలీస్ క్వార్టర్లను పరిశీలిస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

చిగురుమామిడి,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):: గ్రామాల్లో వీధి రౌడీలుగా చలామణి అవుతూ గ్రూపులుగా ఏర్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై రౌడీషీట్ తెరవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న దెబ్బతిన్న పోలీస్ క్వార్టర్స్‌లను పరిశీలించారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మండలంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి నివారణకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. గంజాయి, పీడీఎస్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని అన్నారు. పేకాట స్థావరాలను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు. ప్రతి నెల వారికి సంబంధించిన సమాచారం సేకరించి రికార్డుల్లో నమోదు చేయలని అన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను ప్రతి రోజు సందర్శించాలని అన్నారు. పాత నేరస్థులపై నిఘాపెట్టాలని సూచించారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ సీఐ కర్రె స్వామి, స్థానిక ఎస్సై బండి రాజేశ్, సిబ్బంది ఉన్నారు.

### ఎస్ఎస్ఏ ఉద్యోగుల

# సమ్మె నోటీసు



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

సుభాష్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయడంతో పాటు ఇతర సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించాలని లేకుంటే నిరవధిక సమ్మెలోకి వెళతామని తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం సమ్మె నోటీసు అందజేసింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గుండ రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి మహేశ్ మాట్లాడుతూ సమగ్రశిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు పేస్కేలు ఇవ్వాలని, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ. 10లక్షలు, ఆరోగ్య బీమా కల్పించాలని, ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి, చేసిన వారికి బెనిఫిట్స్ కింద రూ. 25లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వ విద్యాశాఖ చేపట్టే నియామకాల్లో తమకు వెయిటేజీ కల్పించాలని, పీటీఐలకు 12నెలల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం 15 రోజుల్లో పరిష్కరించని పక్షంలో సమ్మెలోకి వెళతామని తెలిపారు.

## జ్వరంతో బాలుడి మృతి

భీమారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలో శుక్రవారం జ్వరంతో బాలుడు మృతి చెందాడు. భీమారం మండల కేంద్రానికి చెందిన ముంజ జలంధర్-శిరీషల కుమారుడు రిషి (13) కొన్ని రోజులుగా జ్వరంతో బాధ పడుతున్నారు. కుటుంబ సభ్యులు నాలుగు రోజుల క్రితం కోరుట్ల ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం రిషిని కరీంనగర్ ఆస్పత్రికి శుక్రవారం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు.


రిషి (ఫైల్)

## అనుమతి లేని ఇసుక లారీ పట్టివేత

మెట్‌పల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గురువారం అర్థరాత్రి అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక లారీని పట్టుకుని సీజ్ చేసినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలో అర్థరాత్రి సమయంలో ఎస్ఐ సత్యయ్యతో కలిసి పోలీసు బృందం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కోరుట్ల నుంచి నిజామాబాదు వైపు ఇసుక లోడుతో వెళుతున్న లారీ ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలను లేవని తెలపడంతో లారీని పోలీసు స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లారీని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. లారీ ఓనరైన అర్మూర్ పట్టణానికి చెందిన రజనీకాంత్ రెడ్డితో పాటు డ్రైవర్ ధారవేణి భూమయ్యపై కేసు నమోదు చేశారు.

## రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక జ్యోతి ఐఐటీ అకాడమీకి చెందిన 9వ తరగతి విద్యార్థి సంజన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు తెలిపారు. నెల 21వ తేదీన చొప్పదండిలో జరిగిన ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి అండర్ 17 నెట్ బాల్ పోటీల్లో గెలుపొంది, ఈ నెల 23నుంచి 5వ తేదీ వరకు మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్ర నెట్ బాల్ పోటీలకు ఎంపికైందన్నారు. పాఠశాల డైరెక్టర్‌లు హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనిక రావు, అజితరావు, రజితరావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## కంకర వేశారు.. తారు మరిచారు

### ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


మొగిలిపేటలో కంకర దుమ్ముతో కూడిన రహదారి

మల్లాపూర్, నవంబరు, 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రహదారిల పునరుద్ధరణలో భాగంగా మండలంలోని మొగిలిపేట ప్రధాన రహదారి గుంతలమయంతో ప్రమాదకరంగా మారడంతో మరమ్మతులకు నిధులు మంజూరు చేశా రు. కానీ రోడ్డు నిర్మాణం కోసం కంకర పోసి తారు మరవడంతో దుమ్ము, దూళి, గుంతలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పాల్పడుతున్నారు. ప్రతి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, వేల సంఖ్యలో ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. గుంతల మయంగా మారిని రహదారిపై మరమ్మతుల కింద 45 రోజుల క్రితం కంకర పోసి వదిలేశారు. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

# అపార్ కార్డులు తప్పని కష్టాలు



- పాఠశాల రికార్డులతో సరిపోలని ఆధార్ వివరాలు
- చాలా మంది విద్యార్థుల వ్యక్తిగత వివరాల్లో తేడాలు




### ఆపార్ నమోదు కొనసాగుతుంది

#### మండల విద్యాధికారి ప్రభాకర్



విద్యాశాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండలంలో ఆపార్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. కొన్ని సాంకేతిక కారణాల వలన ఆన్ లైన్ మందకొడిగా సాగుతోంది. విద్యార్థుల అన్ని వివరాలు సరిపోలితేనే ఆపార్ జనరేట్ అవుతుంది. త్వరితగతిన పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం.

వెల్గటూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న ఒకటవ తరగతి నుంచి 12వ తరగతి వరకు గల విద్యార్థులకు అపార్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. వన్ నేషన్ వన్ కార్డులో భాగంగా ఆటో మేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరుతో 12 అంకెల సంఖ్యతో కార్డు జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వీటిని జారీ చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో అన్ని పాఠశాలల నుంచి విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో సేకరించే కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థుల పురోగతిని అంచనా వేయడానికి ఇది ఉపయోగపడు తుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే విద్యార్థులకు ఆధార్ నెంబర్, పెన్ నెంబరు కేటాయించి నప్పటికీ, దేశవ్యాప్తంగా విద్యార్థికి అపార్ పేరుతో మరోనెంబర్ కేటాయించే కార్యక్రమం ప్రారంభించారు.

### నత్త నడకన నమోదు

నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి జీవితకాల గుర్తింపు సంఖ్యతో అపార్ కార్డు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 1165 ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో కలిపి 1,60,152 మంది విద్యార్థులకు అపార్ కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ జిల్లాలో నమోదు ప్రక్రియ నత్త నడకన సాగుతున్నట్లు అధికారిక లెక్కలే తెలుపుతున్నాయి. జిల్లాలో 109 పాఠశాలలు మాత్రమే కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించగా మొత్తం మీద కేవలం సుమా రు 5 వేల మంది విద్యార్థుల నమోదు ప్రక్రియ మాత్రమే పూర్తి అయినట్లు తెలుస్తోంది. కార్డుల జారీకి కష్టాలు తప్పడం లేదు.

### రికార్డులకు సరిపోలని వివరాలు

చాలా మంది విద్యార్థుల వివరాలు పాఠశాల రికార్డుల్లో ఒక రకంగా ఉండగా ఆధార్ కార్డుల్లో మరో రకంగా ఉంటున్నాయని ప్రధానోపాధ్యాయులు తెలుపుతున్నారు. కొంత మంది వివరాలు మాత్రమే ఆధార్ కార్డులతో సరిపోతున్నాయని తెలుస్తోంది.

పిల్లలు చిన్న తనంలో ఉన్నపుడు ఆధార్ తీయడంతో ఆధార్ నమోదులోనే ఎక్కువగా తప్పులు ఉంటున్నాయని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నారు. విద్యార్థులకు అపార్ నెంబరు ఆన్‌లైన్‌లో కేటాయిం చాలంటే విద్యార్థి జనన ధ్రువీకరణ పత్రంలో గల వివరాలకు, ఆధార్‌లో ఉన్న వివరాలకు, పాఠశాల అడ్మిషన్ రికార్డులో గల వివరాలకు సరిపోవాలి. మూడింటి వివరాలు సరి పోతేనే ఆపార్ నెంబర్లు జనరేట్ అవుతున్నాయి. ఈ మూడింటిలో విద్యార్థుల వివరాలు సరిపోకపోతే ఆ విద్యార్థికి ఆన్ లైన్‌లో ఆపార్ నెంబరు జనరేట్ కావడం లేదు. దీంతో ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకునే పరిస్థితి వచ్చింది.

## ఎదురెదురుగా ఢీకొన్న లారీలు

- క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్లు
- ముగ్గురికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు


ప్రమాద స్థలంలో డ్రైవర్లను బయటకు తీస్తున్న పోలీసులు

మల్యాల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు సమీపంలో శుక్ర వారం వేకువజామున ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాల య్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్ నుంచి కరీంనగర్ వైపు వెలుతున్న లారీ, ఆంధ్ర ప్రదేశ్‌లోని ఎన్టీయార్ జిల్లా నుంచి పత్తి లోడ్‌తో జగిత్యాల వైపు వస్తున్న లారీ రెండు కొండగట్టు సమీపంలో ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రెండు లారీల ముందు భాగాలు నుజ్జు నుజ్జు కావడంతో క్యాబిన్‌లో డ్రైవర్లు దేవీలాల్, వీరయ్యలు ఇరుక్కు పోయారు. దీంతో పలువురు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు జేసీబీ సహాయంతో క్యాబిన్‌లో ఇరుక్కొని తీవ్ర గాయాలపాలైన డ్రైవర్లను బయటకు తీశారు. వారితో పాటు లారీలో గల మరో వ్యక్తి శ్రీనివాస్ రెడ్డికి కూడా గాయాలు కాగ గాయపడిన వారిని చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


క్యాబిన్‌లో ఇరుక్కుపొయిన డ్రైవర్

## సిగరెట్ తాగవద్దన్నందుకు

### ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య

కోనరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు సిగరెట్ తాగవద్దన్నారని పదో తరగతి విద్యార్థి శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన అలువాల వెంకటేష్ (16) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కొద్ది రోజులుగా సిగరెట్‌కు అలవాటు పడ్డాడు. ఈ విషయమై గతంలో తల్లిదండ్రులు మందలించగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స చేయించడంతో కోలుకున్నాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులు, స్నేహితులతో ముభావంగా ఉంటున్నాడు. గురువారం సిగరెట్ తాగవద్దని, చదువుకోవాలని తల్లిదండ్రులు సూచించారు. దీంతో తరుచూ తనను సిగరెట్ తాగవద్దంటున్నారని కోపంతో శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి ఉన్నారు.


ఆటోను బయటకు తీస్తున్న పోలీసులు

## ఘాట్‌రోడ్డుపై అదుపు తప్పిన ఆటో

- విద్యుత్ స్థంభానికి ఢీ
- అంజన్న దర్శనం చేసుకొని వెలుతుండగా ఘటన

మల్యాల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజన్న దర్శనం చేసుకొని తిరిగి వెలుతున్న భక్తుల ఆటో ఘాట్ రోడ్డుపై అదుపు తప్పి విద్యుత్‌స్థంబానికి ఢీకొంది. మంచిర్యాల జిల్లాలోని మందమర్రికి చెందిన ఓ కుటుంబం దైవదర్శనం నిమిత్తం కొండగట్టుకు వచ్చి వెలుతుండగా గతంలో ఆర్టీసీ బస్సు ప్రమాదం జరిగిన చోట ఆటో అదుపుతప్పి ఘాట్‌రోడ్డు పక్కన గల విద్యుత్‌స్థంభానికి ఢీకొని గతంలో ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన రక్షణగోడ వద్ద నిలిచింది. ఈ ప్రమాదంలో ఆటోలో గల వారందరూ క్షేమంగా బయట పడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆటోను జేసీబీ సహాయంతో రక్షణగోడ నుంచి లాగి బయటకు తీశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


- సీఎం సభ ముట్టడికి బీసీ సంఘం పిలుపు
- పలు పార్టీల మద్దతు కోరుతున్న నాయకులు

గణేశ్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కరీంనగర్‌లో జరిగే సీఎం సభ ముట్టడికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు ప్రతిపక్ష నాయకులకు విద్యార్థుల సమస్యలు వివరిస్తూ గత 3 సంవత్సరాల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని దీనివలన విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా ఇప్పటికీ ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదని తెలిపారు. మూసీ సుందరీకరణ చేస్తామని చెప్పే ప్రభుత్వం విద్యార్థులను మాత్రం గాలికి వదిలేస్తున్నదన్నారు. కరీంనగర్‌లో త్వరలో జరుగనున్న సీఎం సభను బీసీ సంక్షేమ సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. దీనికి పలు రాజకీయ పార్టీలు వారి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు హామీ ఇచ్చారన్నారు. యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్‌రాజు ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీల మద్దతు కోరారు.

## వ్యవసాయ మోటార్ల చోరీ

ఇల్లంతకుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్‌లో వ్యవసాయ బావుల వద్ద నుంచి ఇద్దరు రైతులకు చెందిన మోటార్లు చోరీకి గురయ్యాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, కేతిరెడ్డి రాంరెడ్డి వ్యవసాయ బావుల వద్ద గదులు నిర్మించుకొని వ్యవసాయ పరికరాలు అందులో ఉంచారు. గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి తాళాలు పగలగొట్టి వ్యవసాయ మోటార్లు, పంపులు, విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్లారు. మరో రైతు కేతిరెడ్డి మధుసూదన్‌రెడ్డికి చెందిన గది తాళాలు పగలగొట్టడానికి ప్రయత్నించారు. దాదాపు 1.30 లక్షల మోటార్లు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు.

# అంజన్న హుండీల లెక్కింపులో నిర్లక్ష్యం..



మల్యాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీల లెక్కింపు సందర్భంగా పర్యవేక్షణపై నిర్లక్ష్యం కనబడుతోంది. తరచూ దొంగతనాలు చోటు చేసుకుంటున్నప్పటికీ లోపాలు సరిదిద్దకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా గురువారం హుండీల లెక్కింపు చేపట్టగా నోట్ల లెక్కింపు పూర్తి అయ్యాక అనుమానం వచ్చిన కొందరి అభ్యంతరం మేరకు మళ్లీ లెక్కింపు చేయడంతో సుమారు రూ. పది వేల వరకు ఎక్కువ వచ్చినట్లు కొండపై చర్చించు కుంటున్నారు. కోటికి పైగా ఆదాయం రాగా అందులో 90శాతం నోట్లు ఉంటాయి. ఈ రకంగా మొత్తం లెక్కింపు చేపట్టిన నోట్లను రీకౌంటింగ్ చేస్తే ఇంకా ఎక్కువగా నోట్లు రావచ్చుననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే ఆలయ సిబ్బం ది ఒకరు చేతిలో వస్తువులను ఉంచు కోవడంతో అక్కడి మిగితా సిబ్బందికి అనుమానం రాగా గుర్తించిన అత ను దాన్ని కౌంటింగ్ డబ్బాలో వేశాడని, కొందరు దాన్ని ఫొటోలు కూడా తీసినట్లు చర్చించుకుంటున్నారు.

ఆయన చేతిలో ఉన్న దానిని బంగారంగా అనుమా నిస్తున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో రామకృష్ణ రావును ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా అందుబాటులో లేరు. గతంలోనూ లెక్కింపు సమయంలో సిబ్బంది

### నోట్ల లెక్కింపులోనూ పర్యవేక్షణ కరువు

చేతివాటానికి పాల్పడిన సంఘటనలు ఉండగా కౌంటిం గ్ ప్రక్రియపై తరచూ విమర్శలు వస్తూనే ఉన్నాయి. హుండీల కౌంటింగ్ సందర్భంగా దేవస్థానం అధికారులు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, సీసీ కెమెరాల పర్యవేక్షణలో దేవస్థానం అధికారులకు తోడు పోలీసుల సమక్షంలో కౌంటింగ్ చేపడుతుంటారు. ఈ లెక్కింపునకు వివిధ ట్రస్ట్‌లకు సంబంధించిన సిబ్బంది నోట్లు లెక్కింపు, నోట్లు వేరు చేస్తుండగా పర్యవేక్షణ అంతంతమాత్రమేనని అందుకే తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

## ప్రతిభ చాటిన విద్యార్థినికి అభినందన


రష్మితను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

హుజూరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న నల్లగొండ రష్మిత అనే విద్యార్థిని 10 కిలో మీటర్ల ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ ఈవెంట్లో ప్రతిభ చాటడంతో శుక్రవారం ప్రిన్సిపాల్ ఇందిరాదేవి అభినందించారు. రష్మిత శాతవాహన యూనివర్సిటీ తరుపున గురువారం కర్ణాటకలోని మంగళూరు యూనివర్సిటీలో నిర్వహించిన క్రీడా పోటీలో పాల్గొన్నది. ప్రతిభ చాటిన రష్మితను కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, సమన్వయకర్త మంగమ్మ, వైస్ ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, అధ్యాపకులు లింగారెడ్డి, రేణుక, మైపాల్‌రెడ్డి, ఓదెలు, ఝాన్సీరాణి, సుమలత, స్వరూపరాణి, రమ, పల్లవి, స్వప్న అభినందించారు.

## 24న రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం సమావేశం

సుభాష్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం సమావేశాన్ని ఈ నెల 24న నిర్వహించను న్నట్లు సంఘం ప్రధానకార్యదర్శి మహేందర్ రాజు తెలిపారు.

శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం మొదటి విడత సమావేశం వరంగల్‌లో, రెండో విడత సమావేశాన్ని కరీంనగర్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. మానకొండూరులో నిర్వహించే ఈ సమావేశంలో కార్యవర్గ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. అంతే కాకుండా సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యలు, సంఘం ఆధ్వర్యంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యక్రమాల గురించి చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో సలహాదారుడు బుచ్చిరెడ్డి, చక్రపాణి, రాజగోపాల్, మధుసూదన్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రాజు

## దాడి ఘటనలో కేసు నమోదు

కరీంనగర్ క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ భారత్ టాకీస్ వద్ద గురువారం అర్థరాత్రి జరిగిన దాడి ఘటనలో నిందితులపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ సిఐ బిల్లాకోటేశ్వర్ తెలిపారు. పెళ్లి భరత్‌లో జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకొని సాహిత్ యాదవ్ అనే వ్యక్తి తన సోదరుడు రిచు, మరో ముగ్గురి స్నేహితులతో కలిసి చింతల విజేందర్ రెడ్డి అనే వ్యక్తిపై కె ఎస్ఎల్ లాడ్జి కారిడార్‌లో రాడ్డుతో ముఖం మీద దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. అడ్డు వచ్చిన వారిని కూడా కొట్టాడని, ఈ మేరకు బాధితుడు విజయేందర్‌రెడ్డి శుక్రవారం ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఈ దాడి ఘటనలో నిందితులైన ఐదుగురు వ్యక్తుల పై కేసు నమోదు చేశామన్నారు.

## డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజులు జైలు శిక్ష

సైదాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ హుజూరాబాద్ కోర్టు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఈశ్వరయ్య శుక్రవారం తీర్పునిచ్చారు. సైదాపూర్ ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా సైదాపూర్ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి బండి నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని కోర్టులో హాజరు పరుచగా మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

## సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఔదార్యం

### ప్రభుత్వ పాఠశాలలో వాటర్ కూలర్ల కోసం రూ.50 వేల విరాళం


చెక్కును అందిస్తున్న వధూవరులు

సుల్తానాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తన వివాహన్ని పురస్కరించుకుని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విరాళం ప్రకటించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం రెండు వాటర్ కూలర్లను సమకూర్చుకునేందుకు యాభై వేల రూపాయలను అందించారు. సుల్తానాబాద్‌కు చెందిన బూడిద స్వామి కరీంనగర్ ఆర్టీసీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆయన కుమారుడు ప్రియతమ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హైదరాబాద్‌లో పని చేస్తున్నారు. ప్రియతమ్ వివాహం పురస్కరించుకుని వారు స్థానిక ప్రభుత్వ పాఠశాలకు రెండు వాటర్ కూలర్లను సమకూర్చాలని భావించారు. ఈ మేరకు వివాహ వేడుక వేదికపైన సంబంధిత ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారదకు యాభై వేల రూపాయల చెక్కును శుక్రవారం నూతన దంపతులు ప్రియతమ్- షరిష్మాలు అందజేశారు. హెచ్‌ఎంతో పాటు వేదికపై ఉన్న మాజీ జడ్పీటీసీ అయిల రమేష్, మున్సిపల్ వైస్‌చైర్ పర్సన్ బిరుదు సమత క్రిష్ణ అభినందించారు.

## రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాజన్న ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్న ఆలయంలోని గండదీపంలో నూనెపోస్తూ గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమపూజలో పాల్గొని, బద్దిపోచమ్మను దర్శించుకొని తిరిగి ప్రయాణమయ్యారు. ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### రాజన్నను దర్శించుకున్న మధుప్రియ


సింగర్ మధుప్రియకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని సింగర్ మధుప్రియ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఆమె వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తదితరులు ఉన్నారు.

### రామగుండంకు నర్సింగ్ కళాశాల

- రూ.26కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ


సింగరేణి మెడికల్ కళాశాల

కళ్యాణ్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రామగుండంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటు కానున్నది. నర్సింగ్‌కళాశాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో నంబరు 183ను జారీ చేసింది. ఏడాదికి 60సీట్ల కెపాసిటీతో ఈ కళాశాలను ఏర్పాటు చేస్తున్నారు. సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్) కు అనుబంధంగా ఈ కళాశాల ఏర్పాటు కానున్నది. ఈ మేరకు శుక్రవారం వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టియానా జెడ్ చుగుంత్ ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎంఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో నిర్మాణం జరుగనున్నది. కళాశాల నిర్మాణం, సామాగ్రి కొనుగోలుకు రూ.26కోట్లు మంజూరు ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరం నుంచే కళాశాల నిర్వహించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్, బీడీఎస్, పారా మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గతంలో విజ్ఞప్తి చేశారు. డెంటల్ కళాశాల కూడా మంజూరయ్యే అవకాశం ఉన్నది.

# ఒగ్గుకథలో దిట్ట..

- మిద్దెరాములు స్ఫూర్తితో కళాసాధన.. వేల సంఖ్యలో ప్రదర్శనలు..
- ఉత్తమ కళాకారుడిగా గోపగోని చంద్రమౌళిగౌడ్‌కు జాతీయ స్థాయి అవార్డు

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన గోపగోని చంద్రమౌళిగౌడ్.. కులవృత్తికి భిన్నంగా ఒగ్గుకథలపై మక్కువ పెంచుకున్నాడు. అప్పట్లో అంతర్జాతీయ ఒగ్గుకథ కళాకారుడు మిద్దెరాములును స్ఫూర్తిగా తీసుకున్నాడు. తన అన్న వద్ద ఒగ్గుకథలు చెప్పడం నేర్చుకున్నాడు. గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాల్లో ఒగ్గుకథను ప్రదర్శిస్తూ ఎన్నో ఏళ్లుగా ప్రశంసలందుకుంటున్నాడు.




ఒగ్గుకథను ప్రదర్శిస్తున్న చంద్రమౌళిగౌడ్

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన గోపగోని చంద్రమౌళిగౌడ్ ఒగ్గుకథ కళాకారుడిగా రాణిస్తున్నాడు. 20 ఏళ్ల వయస్సులో మిద్దె రాములు స్ఫూర్తితో చంద్రమౌళిగౌడ్ ఒగ్గుకథ నేర్చుకున్నాడు. చిన్నతనంలోనే జానపద గేయాలు పాడే చంద్రమౌళి ఒగ్గుకథ నేర్చుకోవాలని ఆలోచనతో మిద్దె రాములును స్ఫూర్తిగా తీసుకున్నాడు. ఒగ్గు కథ కళాకారుడైన తన అన్న గోపగోని ఓదెలు వద్ద శిష్యరికం చేసి ఒగ్గు కథను నేర్చుకున్నాడు. తర్వాత బృందాన్ని ఏర్పాటు చేసుకొని గత 26 సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా రెండు వేలకు పైగా ప్రదర్శనలిచ్చి ప్రజల మన్ననలు పొందాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఒగ్గు కథ ద్వారా ప్రజల్లో చైతన్యం నింపి ప్రజా గాయకుడు గద్దర్ ప్రశంసలందుకున్నాడు.

అప్పట్లో హైదరాబాద్ జరిగిన కళోత్సవాల్లో ఒగ్గు కథ చెప్పి ఉత్తమ ఒగ్గుకథ అవార్డును అప్పటి ప్రభుత్వ సలహాదారుడు కేవీ రమణ చారి చేతుల మీదుగా అందుకున్నాడు. ప్రభుత్వ కార్య క్రమాలు, ఎయిడ్స్, అక్షరాస్యత, కుటుంబ నియం త్రణ, మద్య పాన నిషేదంపై ప్రభుత్వం నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొని పలువురి ప్రశంసలు అందుకున్నాడు. చంద్రమౌళిగౌడ్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. స్వగ్రామంలో ఓ వైపు హోటల్ నడిపించుకుంటూ మరోవైపు గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాల్లో చంద్రమౌళిగౌడ్ ఒగ్గు కథ ప్రదర్శనలు ఇస్తున్నాడు.

**న్యూస్ బాక్స్**

### గోదావరి మహా హారతి పోస్టర్ ఆవిష్కరణ

ధర్మపురి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఎదుట గోదావరి మహాహారతి వాల్ పోస్టర్‌ను ఉత్సవ సమితా రాష్ట్ర కో కన్వీనర్ దామెర రాంసుధాకర్‌రావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంసుధాకర్‌రావు మాట్లాడుతూ ధర్మపురి క్షేత్రంలో 13 ఏళ్లుగా గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 30 శనివారం సాయంత్రం జరిగే గోదావరి మహా హారతి కార్యక్రమానికి విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠా ధిపతి, పూజ్య శ్రీ అతిథేశ్వరానంద పర్వత హాజరవుతారని పేర్కొన్నారు. బ్రహ్మశ్రీ పాలెపు భరత్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి రాష్ట్ర కన్వీనర్ లింగంపెల్లి వీరగోపాల్, కో కన్వీనర్ బల్గూరి సంతోష్‌రావు హాజరవుతారని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గోదావరి హారతి ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, సభ్యులు సురేం దర్‌రెడ్డి, నర్సింహమూర్తి, లక్ష్మీనర్సయ్యగౌడ్, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ నాయకులు కస్తూరి రాజన్న, సంగి నర్సయ్య పాల్గొన్నారు.

## మిడ్ మానేరు నిర్వాసితులను కేసీఆర్ ప్రభుత్వం మోసగించింది

- కాంగ్రెస్ ప్రభుత్వమైన ఆదుకోవాలి - సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

సిరిసిల్ల టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరు నిర్వాసితులకు ఇళ్లు నిర్మించుకోవడం కోసం గత కేసీఆర్ ప్రభుత్వం రూ. 5లక్షల 4వేలు ఇస్తామని మాట ఇచ్చి మోసం చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వేణు మాట్లాడారు. మిడ్ మానేరు కోసం 12 వేల కుటుంబాలు ఇళ్లు, వ్యవసాయ భూములు కోల్పోయారని 25 టీఎంసీల నీటి నిల్వకు సహకరించిన నిర్వాసిత కుటుం బాలను ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. త్యాగాలు చేసిన మిడ్ మానేరు నిర్వాసితులను గత కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. నిర్వాసితులందరు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకొని వేములవాడ, మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం కృషి చేశారన్నారు. మిడ్ మానేరు నిర్వాసితులందరికీ రూ. 5లక్షల 4వేలు ఇవ్వాలన్నారు. 1200వేల మంది నిర్వాసిత కుటుంబాలు ఉంటే కేవలం 4,696 మంది కుటుంబాలకే ఇవ్వడం అనేది బాధాకరమన్నారు. అప్పులు చేసి ఇళ్లు నిర్మాణం చేసుకున్న కుటుంబాలు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇళ్లు నిర్మించుకోవడానికి జీవో ఉన్న విషయాన్ని ప్రభుత్వం మరిచిపోవద్దన్నారు. తరతరాలకు నీరు అందించే మిడ్ మానేరు నిర్మాణం కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5 లక్షల 4 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులకు రావాల్సిన కుటుంబ ప్యాకేజీ రూ.2 లక్షలు, నిరుద్యోగ భృతి తక్షణమే ఇవ్వాలన్నారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళలు చేపడతా మన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, సోమ నాగరాజు, శ్రావణపల్లి మల్లేశం, బాచుపల్లి శంకర్ పాల్గొన్నారు.

### 21వ రోజు ఘనంగా గోదావరి హారతి


ధర్మపురి వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి హారతి 21వ రోజు శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జాతీయస్థాయి పోటీలకు క్రీడాపాఠశాల విద్యార్థులు


క్రీడాపాఠశాల విద్యార్థులతో కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 అథ్లెటిక్స్ పోటీలకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని క్రీడాపాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల ఖమ్మం, హనుమకొండలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో క్రీడాపాఠశాల విద్యార్థులు దీపిక, రేవతి, వైశాలి, జాహ్నవి పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 26 నుంచి 30 వరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు.

- ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన నెల్లి అనిహశ్రీ రాజ్‌కోట్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. జాతీయస్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులను ఉత్తేజపరి చేందుకు కలెక్టర్ లగేజ్ బ్యాగులను అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, అథ్లెటిక్స్ కోచ్ పవన్, స్విమ్మింగ్ కోచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## స్కానింగ్ సెంటర్లలో అధికారుల తనిఖీలు


తనిఖీ చేస్తున్న అధికారులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం వసంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజలి జిల్లా పరిధిలోని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్లలోని రికార్డులను, ఆడిట్ రికార్డులను, రిపోర్ట్‌లను పరిశీలించారు. నిబంధనలు అనుసరించి స్కానింగ్ సెంటర్లను నిర్వహించాలని సూచించారు. స్కానింగ్ మిషన్లను సర్టిఫికెట్లలో రిజిస్ట్రేషన్ తప్ప నిసరిగా ఉండాలని లేకుంటే స్కానింగ్ మిషన్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీలలో హెచ్‌ఈ బాలయ్య, సీహెచ్‌వో బాలచంద్రం పాల్గొన్నారు.

## నేటి పరిస్థితుల్లో కరాటే మార్షల్ ఆర్ట్స్ తప్పనిసరి

- మహిళలకు ఆత్మరక్షణ క్రీడగా కరాటే - సినీ హీరో సుమన్ - ప్రారంభమైన జాతీయస్థాయి కరాటే పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణంరాజు సతీమణి శారదాదేవి, హీరో సుమన్

కరీంనగర్ స్పోర్ట్స్ నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ కరాటే మార్షల్ ఆర్ట్స్ తప్పనిసరి అని సినీ హీరో సుమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న కృష్ణంరాజు మెమోరియల్ జాతీయస్థాయి కరాటే పోటీలను ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంలోనే నెంబర్ వన్ క్రీడగా కరాటే వెలుగొందుతుందన్నారు. మహిళలకు ప్రత్యేకించి బాలికలకు మార్షల్ ఆర్ట్స్ ఒక ఆత్మరక్షణ క్రీడగా ఉపయోగపడుతుందన్నారు. కరాటేతో శారీరక పటుత్వం పెంపొందుతుందని, విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ కరాటేలో శిక్షణ పొందాలన్నారు. మరో అతిథి సినీ హీరో కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి మాట్లాడుతూ కరాటేతో మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయన్నారు. పాఠశాల స్థాయిలో కరాటే ను ప్రభుత్వాలు తప్పనిసరి క్రీడగా చేయాలని సూచించారు. జాతీయస్థాయి పోటీల నిర్వాహకుడు, కాయ్ జాతీయ సంయుక్త కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోని 15 రాష్ట్రాల నుంచి వెయ్యి మంది క్రీడకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్ర మంలో సీఎస్‌కే చైర్మన్, కరాటే సంఘం జిల్లా అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఒలంపిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, కాయ్ చైర్మన్ కే వసంత్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌరు రాజిరెడ్డి, కరాటే సీనియర్ మాస్టర్ వేణుగో పాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడుగుల ప్రవీణ్, జిల్లా కార్యదర్శి ఆర్ ప్రసన్న కృష్ణ, కోశాధికారి వంగల శ్రీధర్, అన్వర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


పోటీల్లో తలపడుతున్న చిన్నారులు

## రేపటి నుంచి కాచిగూడకు ప్రత్యేక రైళ్లు

కరీంనగర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి కాచిగూడకు ఆదివారం నుంచి ప్రత్యేక రైళ్లు నడిపునస్తున్నట్లు కరీంనగర్ రైల్వే స్టేషన్ మేనేజర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఆర్‌బీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఈ ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 24, 25, 26, 28 తేదీల్లో కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక రైలు బయలుదేరి మధ్యాహ్నం రెండు గంటలకు కాచిగూడకు చేరుకుంటుందన్నారు. తిరిగి మధ్యాహ్నం మూడు గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరి రాత్రి 11.15 గంటలకు కరీంనగర్‌కు చేరుకుటుందని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# చిన్న వయస్సు.. పెద్ద మనసు

- బర్త్‌డే, డిసెంబరు 31 వేడుకలకు దూరం
- ఆ డబ్బుతో పేదలకు సేవా కార్యక్రమాలు
- జ్యోతిక, కౌశిక్‌ల ఉదారతకు ప్రశంసలు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో పురస్కారాలు


దివ్యాంగులకు వీల్‌చైర్ అందిస్తున్న జ్యోతిక, కౌశిక్

**పుట్టిన రోజు, డిసెంబరు 31 వేడకుల పేరిట డబ్బులు వృథా చేయవద్దని, ఆ డబ్బుతో పేదలకు ఏదైనా సహాయం చేయాలన్నది ఆ చిన్నారుల సంకల్పం. కరోనా విపత్తు సమయంలో పేదలు తిండి లేక పస్తులున్న నిస్సహాయ స్థితి వారిని కదలించింది. తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీని దాచి పెట్టి ఆ డబ్బులతో పేదలకు నిత్యావసర సరుకులను అందించారు సుల్తానాబాద్ పట్టణానికి చెందిన జ్యోతిక, కౌశిక్. వారి సేవాగుణానికి గుర్తించిన వివిధ సంస్థలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులతో సత్కరించాయి.**

సుల్తానాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వారి వయస్సు చిన్నదే అయినా మనసు పెద్దది. తమ పుట్టిన రోజు వేడుకలను, ఇయర్ ఎండింగ్ సెలబ్రేషన్స్ జరుపుకోకుండా ఆ డబ్బుతో పేదలకు సహాయం చేయాలని భావించారు. అలా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించి పలువురి మన్ననలు పొందారు. కరోనా సమయంలో ప్రైవేట్ పాఠశాలలు మూతపడడం, యాజమాన్యాలు వేతనాలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ టీచర్ల కుటుంబాల పోషణ భారంగా మారింది. ఈ నేపథ్యంలో దాదాపు 207 మంది టీచర్లకు పలువురు దాతల సహకారంతో నిత్యావసర సరుకులు అందించారు. కరోనా బాధితులకు సేవలందించారు. 167 మంది కరోనా పేషంట్లకు అవసరమైన పాలు, బ్రెడ్లు, పండ్లు అందించారు. అవసరమైన వారికి భోజనాలు సమకూర్చారు. టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయులకు ఏదైనా సహాయం చేయాలని వారు ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త స్పందన లభించింది.

**● పుట్టిన రోజు వేడుకలు మానుకుని..**

సుల్తానాబాద్ పట్టణంలోని ద్వారకానగర్‌కు చెందిన ఏగోలపు సదయ్య-సుజాత దంపతులకు ఇద్దరు సంతానం. కూతురు జ్యోతిక, కుమారుడు కౌశిక్‌లు తమ పదో ఏట నుంచి పుట్టిన రోజు జరుపుకోవడం మానుకొని వాటికయ్యే ఖర్చుతో పేదలకు ఏదైనా సేవ చేయాలని సంకల్పించారు. ఆర్థికంగా ఉన్న వారు కానీ, మధ్య తరగతి వారు కానీ తమ పిల్లల పుట్టిన రోజు పేరిట వేడుకలు నిర్వహించడం, వాటికి పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు చేయడం సరికాదని జ్యోతిక కౌశిక్‌లు భావించారు. అలాగే డిసెంబర్ 31 పేరిట వృథా ఖర్చు చేయవద్దని, ఆ డబ్బుతో పేదలకు సహాయం చేయాలని, తాము దీనిని ఆచరిస్తున్నామంటూ చేసిన చాలెంజ్ చాలా మంది పిల్లలను ఆలోచింపజేసింది. దాంతో వారు కూడా సేవా కార్యక్రమాలు చేపట్టారు.

**● పాకెట్ మనీతో పాటు దాతల సహకారం..**

తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీతో పాటు దాతల సహకారంతో జ్యోతిక, కౌశిక్‌లు సుల్తానాబాద్ పట్టణమే కాకుండా పెద్దపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా తమ సేవా కార్యక్రమాలను చేపట్టారు. అనేక మంది పేద విద్యార్థుల ఫీజులు చెల్లించి ఆదుకున్నారు. వికలాంగులకు అవసరమైన పరికరాలు అందించారు. పేదలకు నెలరోజుల పాటు సరిపడా నిత్యావసర సరుకులు సమకూర్చారు. పండుగల సందర్భంలో కొత్త బట్టలు అందించారు. చలికాలంలో అనాథలకు, యాచకులకు ఉన్ని దుస్తులు కొనిచ్చారు. ఇలా గత ఆరు సంవత్సరాల నుంచి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.


పేదలకు నిత్యావసర సరుకులు అందిస్తున్న చిన్నారులు (ఫైల్)

**● రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు**

జ్యోతిక, కౌశిక్‌లు చేస్తున్న సేవలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. అనేక సంస్థలు వీరికి అవార్డులు ప్రకటించి సన్మానాలు చేశాయి. ఎంతో మంది ప్రముఖులు వీరి ఉదారతను ప్రశంసించి సన్మానించారు.


జ్యోతిక, కౌశిక్‌లను సన్మానిస్తున్న సినీ నటుడు సుమన్ (ఫైల్)

## నగునూర్‌లో ఎంపీవో విచారణ

కరీంనగర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో నగునూర్‌లో సీలింగ్ భూముల ఫిర్యాదుపై శుక్రవారం మండల పంచాయతీ అధికారి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం గ్రామపంచాయతీలో విచారణ చేపట్టారు. ఈనెల 3వ తేదీన ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ గ్రామంలోని సీలింగ్ బూములకు ఇంటి నెంబర్‌లు రద్దు చేయాలని అలాగే గ్రామ పంచాయతీ పరిధిలోని పలు సర్వే నంబర్లలో ఇంటి నంబర్లు ఇచ్చిన వాటిని రద్దు చేయాలని కోరుతూ జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీవో విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఉన్నత అధికారులకు నివేదకి అందిస్తామని ఎంపీవో తెలిపారు.

## పాఠశాల ఆకస్మిక తనిఖీ

కరీంనగర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో ప్రభుత్వ పాఠశాలను మండల విద్యాధికారి రవీందర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. క్లాసు రూముల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధన ఎలా ఉందని విద్యార్థులను అడిగారు. ఆయన వెంట హెచ్‌ఎం శ్రీదేవి, సీఆర్‌పీ రవిచంద్ర ఉన్నారు.

## మెప్మా పీడీని కలిసిన టీఎన్‌జీవో నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మెప్మా పీడీగా బాధ్యతలు చేపట్టిన వేణుమాధవరెడ్డిని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. కార్యక్రమంలో నాయకులు సంగెం లక్ష్మణరావు, ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, గంగార రమేశ్, రాజేశ్వరరావు, సర్దార్ హర్మిందర్‌సింగ్, రాజేశ్‌భరద్వాజ్, నేరెళ్ళ కిషన్, సిహెచ్ జోయల్, నాల్గవతరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్, సచిత్, చిరంజీవి పాల్గొన్నారు.

## నియామకం

సుభాష్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాయీబ్రాహ్మణ యువజన సంఘం జిల్లా కన్వీనర్‌గా సమ్మెట శ్రీనివాస్, కో కన్వీనర్‌గా ఓరుగంటి వేణును నియమిస్తూ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తమ నియామకానికి సహకరించిన వారందరికి శ్రీనివాస్, వేణు కృతజ్ఞతలు తెలిపారు.

# 'కమాండ్ కంట్రోల్' పనులు త్వరగా పూర్తి చేయండి

### - మేయర్ యాదగిరి సునీల్‌రావు



వివరాలను అడిగి తెలుసుకుంటున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేబుల్ బ్రిడ్జి సమీపంలో స్మార్ట్‌సిటీ నిధులు 16 కోట్లతో చేపడుతున్న స్పెషల్ పర్పస్ వెహికిల్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ భవన నిర్మాణ పనులను జనవరిలోగా పూర్తయ్యేలా వేగంగా చేపట్టాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆదేశించారు. శుక్రవారం ఆయన కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 70శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 30శాతం పనులను వేగంగా పూర్తిచేసి జనవరిలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి సర్వలెన్స్ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నలింగ్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, అడ్రసింగ్ సిస్టమ్ తదితర అంశాలపై కమాండ్ కంట్రోల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సోమవారం లోగా కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని చెప్పారు. పీఎంసీ, కాంట్రాక్టర్ మధ్య సమన్వయ లోపంతో పనుల్లో ఆలస్యం జరుగుతుందని, ఇప్పటికైనా సమష్టిగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్, పీఎంసీ అధికారులు, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

**● లీకేజీ మరమ్మతులు చేయండి..**

నగరంలోని 33వ డివిజన్ భగత్‌నగర్ రిజర్వాయర్ పరిధిలో 300 ఎంఎం డయా మంచినీటి పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు నల్లా నీటిని అందించాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన లీకేజీ మరమ్మతు పనులను పరిశీలించారు. గోదాంగడ్డ రోడ్డులో రెండుచోట్ల పైపులైన్ లీకేజీ ఏర్పడి నీరు వృధాగా పోతుందని, వెంటనే మరమ్మతు చేయించి నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని అన్నారు.

## రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలకు ట్రినిటి విద్యార్థిని



హాసినిని అభినందిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జూనియర్ కళాశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే అండర్-19, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా కేంద్రంలోని ట్రినిటీ కళాశాల విద్యార్థిని డి హాసిని ఎంపికైంది. ఇటీవల అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విశేష ప్రతిభచాటిన హాసిని ఈనెల 23 నుంచి 25 వరకు రంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని కళాశాల పీడీ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి హసినిని శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో దాసరి ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## 'పరిచయం' చరిత్రలో నిలిచిపోతుంది



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ నలిమెల భాస్కర్, పాల్గొన్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సాహిత్యంలో లోతైన అవగాహనతో తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ బూర్ల వేంకటేశ్వర్లు రాసిన 'పరిచయం' సారస్వత వ్యాసాల పుస్తకం చరిత్రలో నిలిచిపోతుందని బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో తెలుగు విభాగం, సాహితీ సోపతి సంయుక్త ఆధ్వర్యంలో బూర్ల వేంకటేశ్వర్లు రాసిన పరిచయం పుస్తకావిష్కరణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పుస్తకాన్ని సీనియర్ పాత్రికేయుడు, కవి, టీయుడబ్ల్యూజే (ఐజెయు) జాతీయ కౌన్సిల్ మెంబర్ నగునూరి శేఖర్‌కు అంకితమిచ్చి సన్మానించారు. కార్యక్రమంలో జం తుశాస్త్ర విభాగాచార్యుడు కడారు సురేందర్‌రెడ్డి, అన్నవరం దేవేందర్, డాక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి, కందుకూరి అంజయ్య, రాపర్తి శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, కవులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

కరీంనగర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై నిత్యం పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అని సీపీఐ కరీంనగర్ నియోజకవర్గ కన్వీనర్ కసిరెడ్డి సురేందర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలం దుర్శేడ్, గుంటూరుపల్లి గ్రామాల్లో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఐఐ వంద సంవత్సరాల ఆవిర్భావ వేడుకలను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు సురేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సాయవేని రాయమల్లు, సహాయ కార్యదర్శి కాల్వ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

## స్వచ్ఛభారత్, హరితహారం నిర్వహణ

భగత్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ పాఠశాలకు ఎన్‌సీసీ కెడెట్స్ శుక్రవారం స్వచ్ఛభారత్, హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కెడెట్లు పాఠశాలలో స్వచ్ఛ భారత్, హరితాహారం కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## దుర్గాభవానీ ఆలయంలో నేడు లక్ష దీపోత్సవం

కరీంనగర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో శనివారం సాయంత్రం కార్తీకమాస లక్ష దీపకాంతుల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగల లక్ష్మణ్ ఓ ప్రకటనలో తెలిపారు.సామూహిక సత్యనారాయణ వ్రతం, అనంతరం లక్ష దీపోత్సవ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

## బోనస్ బొనాంజా

(5వ పేజీ తరువాయి)

నిల్వ చేసుకోవడం లేక ఎక్కువ ధరకు ప్రైవేట్‌గా విక్రయించడంతోనే సన్న ధాన్యం అంతగా కేంద్రాలకు రావడం లేదని భావిస్తున్నారు. వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నా అంచనాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాకపోవడానికి ప్రధాన కారణం రైతులు ఇప్పటికే ప్రైవేట్‌గా వ్యాపారులకు, మిల్లర్లకు ధాన్యం అమ్ముకున్నట్లు భావిస్తున్నారు. మిల్లర్లకు ప్రభుత్వానికి కస్టమ్ మిల్లింగ్ విషయంలో ఒక అవగాహన కుదరని కారణంగా కొనుగోళ్ల ఆలస్యం కావడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే ధాన్యాన్ని విక్రయించుకున్నారు. చాలా మంది మిల్లర్లు 1800 నుంచి 1900 రూపాయల వరకు చెల్లించి నేరుగా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ కారణంగానే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అంచనా మేరకు రావడం లేదు. డిసెంబర్ నెలాఖరువరకు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చినా గొప్పేనని భావిస్తున్నారు.

## సమగ్ర కుటుంబ సర్వే పూర్తి

కరీంనగర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే శుక్రవారం నాటికి ముగిసిందని ఎంపీడీవో సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ఇప్పటివరకు 10,552 కుటుంబాల్లో సర్వే పూర్తయిందన్నారు. మండలంలోని తహెర్ కొండాపూర్, బహదూర్‌ఖాన్‌పేట, ఏగుర్తి, దుబ్బపల్లి, ఎలబోతారం, ఫకీర్‌పేట, గోపాల్‌పూర్, ఇరుకుల్ల, జూబ్లీనగర్, మండలపల్లిలో, మొగ్దుంపూర్, మందులపల్లి, నగునూర్‌లో వంద శాతం సర్వే పూర్తి అయిందన్నారు. నల్లగుంటపల్లిలో 98శాతం, దుర్శేడ్‌లో 98.88శాతం, చెర్లబూత్కూర్‌లో 99శాతం, చామనపల్లిలో 99.51శాతం పూర్తయినట్లు తెలిపారు. కొందరు అందుబాటులో లేరని వారి వివరాలను కూడా త్వరలోనే సేకరిస్తామని ఎంపీడీవో తెలిపారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ శిబిరం

భగత్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): లైన్స్‌క్లబ్ ఆఫ్ భగత్‌నగర్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ శిబిరం శుక్రవారం నిర్వహించారు. భగత్‌నగర్ క్లబ్ ఆధ్వర్యంలో సర్కస్ గ్రౌండ్, రామచంద్రాపూర్ కాలని, భగత్‌నగర్ చౌరస్తా వద్ద ఉచిత డయాబెటిక్ శిబిరం నిర్వహించి 200 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ భగత్‌నగర్ అధ్యక్షుడు సిరిపురం ప్రసాద్, కార్యదర్శి బాలరత్నం, కోశాధికారి రామచంద్ర, ఆర్‌సి సత్యనారాయణరావు, డిస్ట్రిక్ డయాబెటిక్ కో-ఆర్డినేటర్ చింతపూవు రవీందర్ పాల్గొన్నారు.

## రేపు దాశరథి 'అగ్నిధార'పై సదస్సు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో దాశరథి జయంతి సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు ఫిలింభవన్‌లో తెలంగాణ మహాకవి దాశరథి కృష్ణమాచార్య రాసిన అగ్నిధార కావ్యంపై పరిశీలన-పరామర్శ సదస్సు నిర్వహించనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య, ప్రచార కార్యదర్శి గుండు రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన వక్తగా కవి, సాహిత్య విమర్శకుడు దర్భశయనం శ్రీనివాసాచార్య హాజరు కానున్నారని పేర్కొన్నారు.

## కురుమ సంఘ భవనానికి నిధులు కేటాయించండి

కరీంనగర్ టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని జ్యోతినగర్ కురుమ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని సంఘం ప్రతినిధులు సుడా చైర్మన్‌ను కోరారు. శుక్రవారం సంఘం ప్రతినిధులు పెద్దకుమర కర్రె బీరయ్య, పబ్బాల వీరయ్య, కర్రె రాజు, శ్రీను, శ్రీనివాస్, మ్యాకల నర్సయ్య, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు.

## తీగలగుట్టపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

కరీంనగర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లిలో విద్యుత్ ఉప కేంద్రం(సబ్ స్టేషన్) ఏర్పాటు చేయాలని స్థానిక కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి శుక్రవారం వినతిపత్రం అందించారు. తీగలగుట్టపల్లిలో 13,500 గృహ విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయ ని, ప్రస్తుతం లోవోల్టేజి సమస్య తీవ్రంగా ఉందని, ప్రతి రోజు రెండు నుండి నాలుగు గంట విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. గతంలో విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేసినా నిర్మాణానికి భూమి విషయంలో అడ్డంకు లు ఏర్పడ్డాయని తెలిపారు. సర్వే నంబర్ 120లో 250కె ఎల్ వాటర్ ట్యాంక్ వద్ద ప్రభుత్వ భూమి ఉందని ఆ ప్రాంతం సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని వివరించారు. ఆ స్థలాన్ని నిర్మాణం కోసం గుర్తించాలని కలెక్టర్‌ను కోరారు. విద్యత్ శాఖ కూడా విద్యుత్ ఉప కేంద్రం నిర్మానానికి సిద్ధంగా ఉన్నందున తీగలగుట్టపల్లి ప్రజల విద్యుత్ సమస్యను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి ఆయన చేశారు.

## కార్తీక దీపోత్సవాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పి సుగుణాకర్‌రావు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న సాయంత్రం 6 గంటల నుంచి గాంధీరోడ్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించే కార్తీక దీపోత్సవాన్ని విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు, ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్ పి సుగుణాకర్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. పురాణం మహేశ్వరశర్మ వైదిక నిర్వహణలో దీపోత్సవం జరుగుతుందన్నారు. ప్రమిదలు, వత్తులు, నూనె అన్నీ తామే సమకూరుస్తామని తెలిపారు. నగరవాసులు, పురప్రముఖులు, మహిళలు, యువతులు, ఆధ్యాత్మిక, దైవిక చింతనాపరు లు, వివిధ సంస్థల బాధ్యులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో తాళ్లపల్లి హరికుమార్‌గౌడ్, గంప జగన్, దుర్గం మారుతి, తాడూరి బ్రహ్మం, బేతి మహేందర్‌రెడ్డి, జెడి భగవాన్, పసుల మహిపాల్, కామారపు నరహరి, పిట్ల స్వామి, తోట రాజేందర్, మొలుగూరి కిషోర్, నడిగొట్టు కుమార్, పరశురాములు, కాచం రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

హుజూరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను శుక్రవారం ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రులలోని రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రులను సక్రమంగా నిర్వహించకపోతే నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.

## విద్యార్థులు వ్యసనాలబారిన పడొద్దు

శంకరపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా విలువలతో కూడిన జీవితాన్ని అలవర్చుకొని ఆదర్శంగా నిలవాలని హుజూరాబాద్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని తాడికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు డ్రగ్స్ సేవించడం వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ వినోద్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ ముకుందరెడ్డి, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఉపయోగపడేలా క్యాంపు కార్యాలయం



క్యాంప్ ఆఫీస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. హుజూరాబాద్ క్యాంప్ కార్యాలయంలో చేపడుతున్న పనులను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. నియోజకవర్గం లోని ప్రజలకు ఎలాంటి అవసరాలు, సమస్యలు ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలు చెప్పుకోవచ్చని తెలిపారు.

## అర్హులు ఓటర్‌గా నమోదు చేసుకోవాలి

ఇల్లందకుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అర్హులు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రాణి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. ఈ నెల 23, 24వ తేదీల్లో స్పెషల్ క్యాంపైన్ డే నిర్వహిస్తున్నామన్నారు. ఎఫ్ 6,7,8 సంబం ధిత ఆర్జీలు పోలింగ్ బూత్ లెవల్ ఆఫీసర్స్ సంబంధిత పోలింగ్ బూత్ అందుబాటులో ఉంటారన్నారు. 18ఏళ్లు నిండిన వారు నమోదు చేసుకోవాలని సూచించారు.

## 'శ్రీ చైతన్య'లో జాతీయ ఫార్మసీ ఉత్సవాలు




కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో 63వ జాతీయ ఫార్మసీ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు ఫార్మా క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్స్, ఓరల్ ప్రజెంటేషన్స్, రంగోళి, ఫైన్ ఆర్ట్స్ పోటీ లను విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామనర్సింహారెడ్డి, ప్రొఫెసర్ అప్పారావు పాల్గొన్నారు.

# రహదారులను కమ్మేసిన ముళ్ల చెట్లు

### - ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు



కొండన్నపల్లి-హిమ్మత్‌నగర్ రోడ్డుపై పెరిగిపోయిన ముళ్ల చెట్లు

గంగాధర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులకు ఇరువైపులా ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని నాగిరెడ్డిపూర్, రామడుగు మండలానికి వేసిన రోడ్డు, హిమ్మత్‌నగర్, కొండన్నపల్లి, కొండయ్య పల్లి, కాచిరెడ్డిపల్లి, బూరుగుపల్లి రోడ్లకు ఇరువైపులా ఏపుగా సర్కారు తుమ్మచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఈ రోడ్ల మీదుగా నిత్యం పాఠశాలలకు బస్సుల్లో విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్లు సైతం ఇరుకుగా ఉండడంతో ఎదురుగా ఏదైన వాహనం వస్తే చాలు ఆ సమ యంలో ముళ్ల చెట్లను రాసుకుంటూ వెళ్లాల్సిందేనని చెబుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనం దగ్గరగా వచ్చే సమయం వరకు కనిపించకపోవడంతో పలువురు ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి పడిపోయిన సంఘటనలు సైతం చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి సారించి రోడ్డుకు ఇరువైపులా ప్రమాదభరితంగా పెరిగిపోతున్న ముళ్ల చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

మానకొండూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీమతి అన్నారు. మండలంలోని గంగిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వహించారు. సీడీపీవో శ్రీమతి మాట్లాడుతూఅంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణ, సరోజన, కిరణ్, జయమని, అంగన్‌వాడీ కార్యకర్తలు శారద, ఉమ, రాజకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## గౌడ సంఘం మండల కార్యవర్గం

గన్నేరువరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గౌడ సంఘం మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుర్ర తిరుపతి, ఉపాధ్యక్షులుగా నేలపట్ల రవి, బట్టు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా బుర్ర కనుకయ్య, కోశాధికారిగా బుర్ర రాజ్, సహాయ కార్యదర్శిగా బొమ్మ సుధాకర్, పొన్నం శ్రీనివాస్, సలహాదారులుగా అటికం శ్రీనివాస్, బుర్ర లక్ష్మీరాజం ఎన్నికయ్యారు.

## సభ్యత్వ నమోదులో పాల్గొనాలి

శంకరపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొవాలని పార్టీ అడహక్ కమిటీ పార్లమెంట్ సభ్యుడు మోరె ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండల కేంద్రంలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు సభ్యత్వ నమోదులో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## పెరుగుతున్న రవాణా సౌకర్యాలు

### - గన్నేరువరం ప్రజలకు తప్పనున్న ఇబ్బందులు

గన్నేరువరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండల ప్రజలు, రైతులకు ఇబ్బందులు తప్పనున్నాయి. మండల కేంద్రం నుంచి పొత్తూరు మీదుగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు, వద్దూరు, బేగంపేట మీదుగా సిద్దిపేట జిల్లాకు, గుండ్లపల్లి మీదుగా కరీంనగర్ జిల్లాలను కలిపేలా డబుల్ రోడ్డు మంజూరు కావడంతో పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఆయా జిల్లాలకు మండల కేంద్రం నుంచి రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని మండల ప్రజలు భావిస్తున్నారు. మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో కాంటా పెట్టిన ధాన్యం మిల్లులకు తరలించేందుకు నిర్వాహకులు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులను పడుతున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పెరిగి కాంటా వేసేం దుకు ఆలస్యమవుతోంది. రోడ్ల నిర్మాణం చేపడుతుండడంతో మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైస్ మిల్లుల ద్వారా ఇక్కడి రైతులు తాము పండించిన ధాన్యాన్ని నేరుగా రైస్‌మిల్లుకు విక్రయిస్తున్నారు. రవాణా సౌకర్యం మెరుగుపడుతుండడంతో మండలంలోని వ్యాపారులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

## హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తిరుపతిరెడ్డి



కంది తిరుపతిరెడ్డి

చిగురుమామిడి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సుందరగిరి గ్రామానికి చెందిన కంది తిరుపతిరెడ్డిని నియమించినట్లు అధికారులు శుక్రవారం ప్రకటించారు. చైర్మన్‌తో పాటు మండలంలోని మూదిమాణిక్యం గ్రామానికి చెందిన ఎండీ కుతుబ్బుద్దీన్, బోడిగె పర్శరాములు(ఇందుర్తి), ఓరుగంటి బారతిదేవి (సుందరగిరి)లను డైరెక్టర్లుగా నియమించారు. కంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలిపారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తిమ్మాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిదో డివిజన్ అలుగునూర్ కూడలి వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నందుకు గాను కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ, డీసీసీ కార్యాల య ఇన్‌చార్జి గోపు మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ చిందం కిష్టయ్య, డివిజన్ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం..

● హుజూరాబాద్ స్వర్ణకారుల జీవితాలకు జీవనోపాధికి విఘాతం కలిగించే వ్యాపార సంస్థలకు అనుమతులు ఇవ్వవద్దని తహసీల్దార్ కనకయ్యకు స్వర్ణకారులు వినతి పత్రం అందజేశారు.

● వీణవంక: జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో చదువుతున్న హర్షిత, వికాస్ రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

● ఇల్లందకుంట: రాష్ట్ర స్థాయి అండర్-17 నెట్‌బాల్ పోటీలకు సిరిసేడు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఆలేటి రాము ఎంపికయ్యాడు.

- రాష్ట్ర ప్రభుత్వం స్వీకరిస్తున్న టెట్ దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచాలని జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వాసు కోరారు.

● శంకరపట్నం: గ్రామాల్లో న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

● చొప్పదండి: కేంద్ర జల శక్తి, పారిశుధ్య ఆన్‌లైన్ వేదికగా దేశవ్యాప్తంగా నిర్వహించిన స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ ఫేస్-2 క్విజ్ పోటీల్లో పాల్గొన్న రేవెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సాహిత్య, వైష్ణవి, వైశాలి, చరణ్ తేజకు ఎంఈవో శ్రీనివాస్ డిజిటల్ పార్టిసిపేషన్ ప్రశంసాపత్రాలను అందజేశారు.

- చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లను పౌర సరఫరాల శాఖ డీటీ ఉషా, ఎస్ఐ అనూష పరిశీలించారు. కొనుగోళ్ల వివరాలతో పాటు రైతుల సమస్యను అడిగి తెలుసుకున్నారు.

- బ్యాంకులో వ్యవసాయ రుణాలు , మహిళా సంఘాల రుణాలు తీసుకునే సమయంలో ప్రతి ఖాతదారుడు తప్పనిసరిగా ప్రమాద బీమా చేయించుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కరీంనగర్ రీజియన్ డీజీఎం అపర్ణరెడ్డి అన్నారు.

● గంగాధర: కొండన్నపల్లికి చెందిన విలా సాగరం లస్మవ్వ(110) అనే శతాధిక వృద్ధురాలు శుక్రవారం మృతి చెందింది.

● చిగురుమామిడి: రాష్ట్ర స్థాయి అండర్- 19 కబడ్డీ పోటీలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన తరుణ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి రంగారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుంది.

● గణేశ్‌నగర్: టౌన్ 8 సెక్షన్ వాటర్ వర్క్స్ సబ్‌స్టేషన్ కరీంనగర్‌లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫర్ లోడ్ ఎనాన్స్‌మెంట్ చేసి 8 ఎంవీఏ నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ టి రమేశ్ బాబు శుక్రవారం ప్రారంభించారు.

- మంకమ్మతోటలోని శ్రీచైతన్య డిగ్రీ, పీజీ, కళాశాలకు చెందిన ఫుడ్ సైన్స్ విభాగపతి జి మహేష్ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన టీఎస్ సెట్ పరీక్షలో అర్హత సాధించాడని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు.

- నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల అధ్యాపకురాలు టి స్వరూపారాణి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డాక్టర్ కె. శ్రీదేవి పర్యవేక్షణలో పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నారు.

● కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ విద్యావాలి ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం నగరంలోని మార్కెట్ యార్డును సందర్శించారు.

● సుభాష్‌నగర్: నగరంలోని పాతబజార్‌కు చెందిన నీల రాజేశ్వరి(70) మృతిచెందగా ఆమె నేత్రాలను లయన్స్‌క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో ఆమె నేత్రాలను సేకరించి ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రికి తరలించారు.